సాక్షి
కామారెడ్డి

ఆదివారం । 26 । జనవరి । 2025



అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పేర్కొన్నారు.

- 9లో ▸



ఓటు వజ్రాయుధం లాంటిది

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.6 /11.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

దోమకొండలో వంద పడకల ఆస్పత్రి

- ఫైల్‌పై సంతకం చేసిన సీఎం!

కామారెడ్డి టౌన్: దోమకొండ సీహెచ్‌సీ వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. దీనికి సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం సంతకం చేశారని సమాచారం. దీనికి సంబంధించిన జీవో త్వరలో విడుదల కానుందని వైద్యారోగ్య శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే ఆస్పత్రి భవన నిర్మాణానికి ముత్యంపేట రోడ్‌లో 4 ఎకరాలకుపైగా భూమికి కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేసింది. వంద పడకల ఆస్పత్రి ఏర్పాటైతే చుట్టుపక్కన మూడు జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని భావిస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగి తొలగింపు

లింగంపేట: జిల్లా వైద్యాధికారి పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడిన కాంట్రాక్ట్ ఉద్యోగి బాలకృష్ణను విధుల నుంచి తొలగించినట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. సదరు ఉద్యోగి దేవునిపల్లి పీహెచ్‌సీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల డీఎంహెచ్‌వో పేరు చెప్పి లింగంపేట మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ, ప్రైవేట్‌లు ముగ్గురి నుంచి రూ. 40 వేలు వసూలు చేశాడు. సదరు వైద్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన అధికారులు విధులనుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని సబ్ జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి సందర్శించారు. జైలులోని సౌకర్యాలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హక్కులు, చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది శ్రీనివాసరావు, సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవరెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది సాయిప్రణీత్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎంపిక



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ధరావత్ మౌనిక న్యూఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే ఎన్‌సీసీ పరేడ్‌కు ఎంపికైంది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎ.సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల నుంచి ఇప్పటివరకు 40 మంది రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించాలి



కామారెడ్డి టౌన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ నాగలక్ష్మి, ఏఎంవీఐ కవిత తదితరులు పాల్గొన్నారు.

నక్సలిజం టు భారత ఆర్మీ



- సైన్యంలో 18 మంది చేరిక..
- ఆదర్శంగా నిలుస్తున్న తిప్పాపూర్‌వాసులు

ఒకప్పుడు ఆ గ్రామం అన్నలకు పెట్టింది పేరు.. గ్రామస్తులు పలువురు విప్లవోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అడవి బాటపట్టి, తుపాకీ చేతబట్టి రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడారు. ఇప్పుడు పరిస్థితి మారింది. యువతరం దేశ సరిహద్దుల రక్షణ కోసం కదులుతోంది. పలువురు దేశ సేవలో తరిస్తున్నారు. – భిక్కనూరు



తిప్పాపూర్ గ్రామ ముఖచిత్రం

భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామం ఒకప్పుడు నక్సలైట్లకు అడ్డాగా ఉండేది. ఆ ఊరిలో 1984లో నక్సలిజం మొదలైంది. దాదాపు ఇంటికొకరు నక్సలైట్లుగా మారారు. గ్రామంలో ఎత్తైన అమరవీరుల స్థూపాన్ని కూడా నిర్మించారు. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీ అధికారులు నలుగురిని తొలిసారిగా ఈ గ్రామంలోనే నక్సలైట్లు కిడ్నాప్ చేసి కలకలం సృష్టించారు. దాదాపు ఆరేళ్ల పాటు ఈ గ్రామం పీపుల్స్‌వార్‌కు కంచుకోటగా ఉంది. 1990 జూలై 23వ తేదీన అప్పటి ఎస్పీ మీనా ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు ఈ గ్రామాన్ని చుట్టుముట్టాయి. ఆ రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్రామానికి చెందిన కమ్మరి యాదగిరి, వంగేటి బాల్‌రెడ్డి, తిరుపరి గాలిరెడ్డి, నర్సగౌడ్ మృతిచెందారు. తర్వాత పోలీసులు గ్రామస్తులతోనే అమరవీరుల స్థూపాన్ని కూల్చివేయించారు. అనంతర కాలంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గ్రామంలో నక్సలిజం తగ్గుముఖం పట్టింది. యువతలోనూ మార్పు వచ్చింది. గ్రామానికి చెందిన అశోక్ అనే యువకుడు 1991లో ఆర్మీకి ఎంపికయ్యాడు. గ్రామంనుంచి సైన్యంలో చేరిన తొలి వ్యక్తి ఈయనే.. తర్వాత రవి, భీంరెడ్డి సైన్యంలో చేరారు. వారిని ఆదర్శంగా తీసుకుని ఇప్పటికీ చాలామంది ఆర్మీవైపు అడుగులు వేస్తున్నారు. గ్రామంలో ఇప్పటివరకు 18 మంది సైన్యంలో చేరారు. సుమారు 40 మంది సైన్యంలో చేరేందుకు శిక్షణ తీసుకుంటున్నారు.

పోలీస్ ఉద్యోగం చేయాలనుకొని..



అప్పట్లో మా గ్రామంలో నక్సలిజం ప్రభావం బాగా ఉండేది. నేను పోలీస్ ఉద్యోగం చేయాలనుకున్నాను. ఈ విషయం నక్సలైట్లకు తెలియడంతో అప్పటి దళం సభ్యులు నన్ను పిలిపించుకుని పోలీస్ ఉద్యోగంలో చేరవద్దని హెచ్చరించారు. దీంతో నేను సైన్యం వైపు వెళ్లాను. మా ఊరునుంచి ఆర్మీలో చేరిన తొలి వ్యక్తిని నేనే అయినందుకు గర్వంగా ఉంది.

– అశోక్, మాజీ సైనికుడు, తిప్పాపూర్

యువకులను ప్రోత్సహిస్తున్నా



ఆర్మీలో చేరడం, దేశ రక్షణ కోసం పాటుపడడం అదృష్టంగా భావిస్తాను. అందుకే ఆర్మీలో చేరాలని యువతను ప్రోత్సహిస్తుంటా. ఆర్మీలో చేరే వారికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాను.

– భీంరెడ్డి, మాజీ సైనికుడు, తిప్పాపూర్

వారే స్ఫూర్తి..



గ్రామానికి చెందిన యువకులు ఆర్మీలో చేరడం చూసి నేను కూడా స్ఫూర్తిని పొందాను. గ్రామానికి చెందిన భీంరెడ్డి రవి, అశోక్, స్వామిలను ఆదర్శంగా తీసుకుని సైనికుడిని అయ్యాను. దేశరక్షణలో భాగస్వామిని అయినందుకు గర్వపడుతున్నా.

– బద్దం రాజు, సైనికుడు, తిప్పాపూర్

సైన్యంలో చేరిన వారు

అశోక్, రవి, భీంరెడ్డి, ఉదయ్‌కుమార్, సంతోష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మణాచారి, కమ్మరి రాజు, కొండ బాబు, శేఖర్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, దినేశ్‌రెడ్డి, బోయిని స్వామి, ఎల్లం యాదవ్, బద్దం రాజు, తరుణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్. అశోక్, రవి, భీంరెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. అశోక్ ప్రస్తుతం డీఆర్‌డీఏలోని డీఎస్‌సీ(డిఫెన్స్ సెక్యూరిటీ కోర్స్)లో విధులు నిర్వహిస్తున్నారు. భీంరెడ్డి రాజకీయాల్లో ఉన్నారు.

రిపబ్లిక్ డేకు ఏర్పాట్లు



కామారెడ్డి క్రైం: గణతంత్ర దినోత్సవాలను నిర్వహించడానికి కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం ఆయన తన ప్రసంగంలో జిల్లా ప్రగతిని వివరిస్తారని, అనంతరం ఇతర కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

నేడు నాలుగు పథకాలకు శ్రీకారం

- మండలానికో గ్రామం ఎంపిక
- లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు



సీఎస్ శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు ఆదివారం శ్రీకారం చుట్టనుంది. అయితే తొలిరోజు అన్ని గ్రామాలలో ఒకేసారి కాకుండా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పథకాలను అమలు చేయనున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలకు సంబంధించి ఇప్పటికే గ్రామ సభల్లో జాబితాలను ప్రదర్శించి ఆమోదించిన విషయం తెలిసిందే. గణతంత్ర దినోత్సవం రోజునే నాలుగు పథకాలను ప్రారంభించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసింది. లబ్ధిదారుల జాబితాలను ప్రజల ముందుంచేందుకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించింది. అర్హత ఉండి ఆయా పథకాల అర్హుల జాబితాలో పేర్లురాని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కాగా ఎంపిక చేసిన గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆదివారం మధ్యాహ్నం నిర్వహించే సమావేశాల్లో మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు.

535 గ్రామ సభలు నిర్వహించాం

- సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

కామారెడ్డి క్రైం: జిల్లాలో నాలుగు పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు 535 గ్రామ సభలు, 80 వార్డు సభలు నిర్వహించామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్‌నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రారంభంపై సమీక్షించారు. ఆయా పథకాల అమలుపై ఆమె పలు సూచనలు ఇచ్చారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన ఒక గ్రామంలో మధ్యాహ్నం ఒంటి గంటకు 4 పథకాలను ప్రారంభించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని, ఆ గ్రామాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రేషన్ కార్డుల కోసం 54,534, ఇందిరమ్మ ఇళ్లకోసం 28,653, రైతు భరోసాకు 2,653, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 18,098 దరఖాస్తులు వచ్చాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో తిరుమల ప్రసాద్, డీపీవో శ్రీనివాస్‌రావు, జెడ్పీ సీఈవో చందర్, డీఎస్‌వో మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాల వివరాలు..

మండలం	గ్రామం	జుక్కల్	బంగారుపల్లె	పిట్లం	హస్నాపూర్
బాన్సువాడ	చిన్న నాగారం	కామారెడ్డి	గూడెం	రాజంపేట	నడిమితండా
భిక్కనూరు	ర్యాగట్లపల్లి	లింగంపేట	ఎల్లారం	రామారెడ్డి	కన్నాపూర్ తండా
బీబీపేట	శివారు రాంరెడ్డిపల్లె	మాచారెడ్డి	రాజ్‌ఖాన్‌పేట	సదాశివనగర్	వజ్జెపల్లి ఖుర్దు
బిచ్కుంద	గుండెకల్లూర్	మద్నూర్	రామూర్	తాడ్వాయి	సంతాయిపేట
బీర్కూర్	రైతునగర్	నాగిరెడ్డిపేట	అచ్చాయపల్లి	ఎల్లారెడ్డి	మల్లాయిపల్లి
దోమకొండ	సీతారాంపల్లి	నిజాంసాగర్	సుల్తాన్‌నగర్	నస్రుల్లాబాద్	రాములుగుట్టతండా
గాంధారి	బ్రాహ్మణపల్లి	పెద్దకొడప్‌గల్	చిన్నతక్కడ్‌పల్లి		

పట్టణాభివృద్ధికి సహకరిస్తా



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని సన్మానిస్తున్న కామారెడ్డి బల్దియా చైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్లు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- ఘనంగా బల్దియా కౌన్సిల్ సభ్యుల వీడ్కోలు కార్యక్రమం

కామారెడ్డి టౌన్: కౌన్సిలర్ల పదవీకాలం ముగిసినా వారి వార్డుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి పట్టణాభివృద్ధికి సహకరిస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఐదేళ్లపాటు కౌన్సిలర్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి పట్టణ అభివృద్ధికి కృషి చేసిన సభ్యులను అభినందించారు. పట్టణ అభివృద్ధి కోసం చర్చించేందుకు తన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. బల్దియాలో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగిరేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులను సత్కరించారు. అనంతరం సభ్యులు షబ్బీర్ అలీని సన్మానించారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ స్పందన, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, గోనె శ్రీను, పున్న రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా వెనకబాటే..

- ఇప్పటికీ అందరికీ కూడు, గూడు దొరకని పరిస్థితి
- మెరుగుపడని ప్రభుత్వ విద్య, వైద్యం
- నేడు గణతంత్ర వజ్రోత్సవాలు



కామారెడ్డిలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ చాలా విషయాల్లో వివక్ష కొనసాగుతూనే ఉంది. పేదలకు ఇప్పటికీ సరైన విద్య, వైద్యం అందడం లేదు. అభివృద్ధి విషయంలో చాలా ప్రాంతాలు వెనకబడే ఉన్నాయి. సరైన రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక, విద్య, వైద్యం అందక, ఉపాధి అవకాశాలు లభించక ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

పేదరికానికి రేషన్‌కార్డులూ సాక్ష్యమే!

రేషన్ కార్డుల పరిస్థితి కూడా అంతే.. జిల్లాలో 3.27 లక్షల కుటుంబాలు ఉండగా.. ఇప్పటికే 2.53 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. కొత్తగా కార్డుల కోసం ఐదారేళ్లలో దాదాపు 30 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా ప్రజాపాలన సభల్లో మరో 28,653 దరఖాస్తులు వచ్చాయి.

మెరుగుపడేనా?

ప్రతి ఒక్కరికీ సమాన విద్య, వైద్య అవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వాలదేనని రాజ్యాంగం నిర్దేశించింది. అయితే ఇప్పటికీ విద్య, వైద్య విషయంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థికంగా ఉన్న వారు, చదువు ప్రాధాన్యత తెలిసిన వారు తమ పిల్లలను కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు పంపుతున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో దాదాపుగా పేద పిల్లలే చదువుతున్నారు. అక్కడ సరైన విద్య అందక చాలా మంది మధ్యలోనే చదువు మానేస్తున్నారు. ఇప్పటికీ ఏటా బడిబయటి పిల్లల కోసం సర్వేలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా చాలా చోట్ల వైద్యులు, సిబ్బంది ఉండడం లేదు. మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో పేదలకు సరైన వైద్య సేవలు అందడం లేదు. ఏటా ఆస్పత్రుల నిర్వహణకు రూ. కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా ఇప్పటికీ చాలా ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపడకపోవడం గమనార్హం. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో వైద్యం అందని ద్రాక్షగానే ఉంది. వైద్యులను, సిబ్బందిని నియమించి కావలసిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ద్వారా జిల్లాలో 3.27 లక్షల కుటుంబాలు ఉన్నట్టు లెక్క తేలింది. అయితే గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2.38 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఇటీవల నాలుగు రోజులపాటు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో మరో 28,653 దరఖాస్తులు వచ్చాయి. దశాబ్దాలుగా రకరకాల పేర్లతో ఇళ్ల నిర్మాణాలు జరిగినట్టు చెబుతున్నా ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షల సంఖ్యలో దరఖాస్తులు రావడం గమనార్హం.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలు..

జిల్లాలో 3.27 లక్షల మంది రైతులు, దాదాపు లక్షన్నర మంది రైతు కూలీలు ఉన్నారు. సరైన సాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కువగా వర్షాధారంగా, భూగర్భ జలాలపై ఆధారపడి సేద్యం చేస్తుంటారు. సరైన ఉపాధి అవకాశాలు లేక మెట్ట ప్రాంతమైన దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి, లింగంపేట, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట తదితర మండలాల నుంచి రైతులు, కూలీల వలసలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసలను నివారించవచ్చు. జిల్లాలో కెమికల్, ఫార్మా కంపెనీలే ఎక్కువగా ఏర్పాటవుతుండడంతో అందులో పెద్దగా ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. లింగంపల్లి సెజ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు అడుగులు పడుతున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సోయా, మక్క, పప్పుదినుసులు వంటి వాటితో తయారయ్యే ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటైతే ఈ ప్రాంత రైతులకు మేలు జరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటు విలువను కాపాడాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్



నిజాంసాగర్ చౌరస్తాలో ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: ప్రజలు ఓటు విలువను కాపాడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. పట్టణాల్లో పోలింగ్ శాతం తక్కువ నమోదవుతోందన్నారు. ఓటర్లు బాధ్యతగా ఓటు వేయాలని సూచించారు. సమావేశానికి హాజరైన వారితో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. వయో వృద్ధులు, యువ ఓటర్లు, థర్డ్ జెండర్లను సన్మానించారు.

నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం..

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులు, విద్యార్థులతో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఆర్డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్ రావు, డీఏవో తిరుమల ప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి భీంకుమార్, తహసీల్దార్ జనార్దన్, కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, టీజీవో అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సత్వర న్యాయం జరిగేలా చూడాలి'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్, వేదికపై న్యాయమూర్తులు

కామారెడ్డి టౌన్: చిన్నారులు, మహిళలకు సంబంధించిన కేసుల్లో సత్వర న్యాయం అందేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. శనివారం జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళల చట్టాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్యానల్ అడ్వకేట్లు, చైల్డ్ వెల్ఫేర్, ఎన్జీవోస్ వలంటీర్లకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సుధాకర్, జిల్లా అదనపు జడ్జి శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి సుమలత, జిల్లా అదనపు జూనియర్ సివిల్ దీక్ష, జూనియర్ సివిల్ జడ్జీలు హారిక, భార్గవి, డీసీపీవో స్రవంతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఖద్దరు జెండాకే ప్రాధాన్యం ఇవ్వాలి

బిచ్కుంద(జుక్కల్): భారత గణతంత్ర దినోత్సవాల్లో జాతీయ పతాకం గౌరవానికి భంగం కలగకుండా అందరు ఘనంగా జరుపుకోవాలని సీఐ జగడం నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సూచించిన నిబంధనల ప్రకారం జెండా ఎత్తు, వెడల్పు ఉండాలని నీలిరంగులు అశోక చక్రం కలిగిన జెండా వాడాలని కోరారు. ఖద్దరుతో తయారు చేసిన త్రివర్ణ పతాకం వాడాలన్నారు. పాత జెండా వాడ వద్దని సూచించారు. నియమావళిలోని నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. జెండాను కింద పారవేయడం అగౌరవంగా ప్రవర్తిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు.

దేశ రక్షణలో మనోళ్లు..



- ఆర్మీలో పనిచేస్తున్న జిల్లావాసులు
- మైలారం, సోమర్యాగడితండా నుంచి పలువురు ఎంపిక
- గ్రామానికి గర్వకారణమంటున్న ప్రజలు

నస్రుల్లాబాద్/ఎల్లారెడ్డిరూరల్: ప్రాణాలను పనంగా పెట్టి జన్మభూమి ఋణం తీర్చుకోవడం కోసం అనుక్షణం పాటుపడుతున్నారు మన సైనికులు. అటువంటి గొప్ప బాధ్యతలోజిల్లా యువకులు పాలుపంచుకుంటున్నారు. దేశ రక్షణలో మనోళ్లు ఉన్నారంటే గ్రామానికి గర్వకారణమంటూ గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నస్రుల్లాబాద్ మండలంలో..

నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామం నుంచి ఐదుగురు ఆర్మీలో ఉద్యోగాలు చేస్తున్నారు. కుటుంబానికి దూరంగా దేశ సేవకు దగ్గరగా తమ బాధ్యతను నెరవేరుస్తున్నారు. ఈ భూమిలో పుట్టిన ప్రతి ఒక్కరూ దేశం కోసం సేవ చేయాలనే తపన, దేశ పరిరక్షణలో పాలు పంచుకోవాలనే ఆశయం వారిని ఈ స్థాయిలో ఉంచింది. నస్రుల్లాబాద్ మండలం నుంచి కేవలం మైలారం యువకులు మాత్రమే ఆర్మీలో పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎల్లారెడ్డి మండలంలో..

ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యాగడితండాకు చెందిన నలుగురు యువకులు దేశ రక్షణకు సంబంధించిన ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. తండాలో 120 కుటుంబాలు ఉండగా 800 మంది నివసిస్తున్నారు. తండాకు చెందిన ఎక్కువ మంది దేశ రక్షణకు సంబందించి ఆర్మీ, సీఆర్‌పీఎఫ్‌లతో పాటు రాష్ట్ర పోలీసు విభాగంలో సైతం విధులను నిర్వర్తిస్తున్నారు. అంగోత్ సంతోష్ ఆర్మీలో జవాన్ విధులను నిర్వర్తిస్తుండగా, అగ్నివీర్‌లో రవీందర్ నాయక్, నరేష్ నాయక్‌లు పని చేస్తున్నారు. ఇటీవల టీఎస్‌పీఎస్ పోలీసు విభాగంలో అనంత్ నాయక్ విధుల్లో చేరి రక్షణ విభాగంలో పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వీరితో పాటు తండాకు చెందిన పలువురు పలు ఉద్యోగాలను చేస్తున్నారు. ధనావత్ నాయక్ బ్యాంకు మేనేజర్‌గా, లకావత్ రవి ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, అజ్మీరా విఠల్ అగ్రికల్చర్ ఆఫీసర్‌గా, అజ్మీరా దశరత్ ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా, పోస్టల్ విభాగంలో తండాకు చెందిన అనిల్, అంగోత్ బాబు, ఆంగోత్ వసంత్, పాట్లోత్ సబితలు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో ఎల్ఐసీ మేనేజర్‌గా పాట్లోత్ దేవ్‌లా, గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలుగా విజయ, ధనావత్ సురేష్, అజ్మీరా రాకేష్‌లు ఎస్‌జీటీ ఉపాధ్యాయులుగా విధులను నిర్వర్తిస్తు తండాకు మంచి పేరును తీసుకువచ్చారు.


కుటుంబసభ్యులతో అనంత్ నాయక్, పోలీస్


అంగోత్ సంతోష్, ఆర్మీ జవాన్


రవీందర్‌నాయక్


నరేష్ నాయక్

భరతమాత రుణం తీర్చుకోవడానికి..



గ్రామంలో జరిగే ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు ఆకర్షితుడినై దేశంపై మమకారం పెంచుకున్నాను. భరతమాత ఋణం తీర్చుకోవడానికి, దేశ సేవలో పాలు పంచుకోవాలని నిర్ణయించుకుని ఆర్మీ సెలక్షన్స్‌లో పాల్గొని, ఎంపికయ్యాను. ట్రెయినింగ్ పూర్తి చేసిన తర్వాత మొదటి పోస్టింగ్ జమ్ము కాశ్మీర్‌లో ఇచ్చారు.

–రామకృష్ణ, సైనికుడు, మైలారం

ఆనందంగా ఉంది..



జవాన్ అవ్వాలన్న ఆశయంతోనే ఆర్మీకి ప్రయత్నించాను. అమ్మనాన్నల ప్రోత్సాహంతోనే ఆర్మీ ఉద్యోగం సాధించాను. దేశ సేవలో నేను సైతం పాలు పంచుకోవడం ఆనందాన్ని కల్గిస్తుంది.

–తేజ, జవాన్, మైలారం

స్నేహితులే ఆదర్శం..



గ్రామం నుంచి గతంలో తోటి స్నేహితులు ఆర్మీకి ఎంపికయి దేశ రక్షణలో సేవలు అందించారు. వారిని ఆదర్శంగా తీసుకొని నేను కూడా ఆర్మీలో పని చేయాలనుకున్నాను. అలాగే అమ్మనాన్నల ప్రోత్సాహం లభించడంతో రెండవ ప్రయత్నంలోనే ఆర్మీ ఉద్యోగం సాధించాను.

–రాజం రాజు, ఆర్మీ సపోర్టింగ్ ఫోర్స్, మైలారం

ముమ్మరంగా కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. గురువారం నాటికి 2లక్షల 38వేల 967 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును క్రషింగ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

గ్రామసభల్లో 3,125 దరఖాస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 21నుంచి 24వరకు నిర్వహించిన గ్రామసభల్లో వివిధ పథకాలకు సంబంధించి మొత్తం 3,125 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో ప్రభాకరచారి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసాకు 134దరఖాస్తులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 444 దరఖాస్తులు, నూతన రేషన్‌కార్డుల కోసం 654దరఖాస్తులు, రేషన్‌కార్డులలో నూతన పేర్ల నమోదు కోసం 573 దరఖాస్తులు, రేషన్‌కార్డుల స్ప్లిటింగ్‌కు సంబంధించి 400 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 920 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు.

ఉచిత శిక్షణ గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్: ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగించినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు జిల్లాలో ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు వివరించారు. దీని కోసం ఆఫ్‌లైన్ ద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97003 51786 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విష జ్వరాలతో విలవిల

- సర్దాపూర్ తండాలో తండావాసులను వణికిస్తున్న వ్యాధులు

మాచారెడ్డి: మండలంలోని సర్దాపూర్ తండాలో విషజ్వరాలు సోకి తండావాసులు విలవిల్లాడుతున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరమొస్తే ఇంటిల్లిపాదిని చుట్టేస్తోందని తండా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చలి, జలుబు, దగ్గుతో కూడిన జ్వరాలు ప్రబలుతున్నాయని తండావాసులు సాక్షికి వివరించారు. 10 నుంచి 15 రోజులపాటు జ్వరాలు పట్టిపీడిస్తుండటంతో గిరిపుత్రులు ప్రయివేట ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో చికిత్స కోసం ఒక్కొక్కరికి సుమారు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చవుతున్నట్లు పేర్కొంటున్నారు. జ్వర పీడితుల్లో ప్రతి ఒక్కరికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి తీవ్ర నీరసానికి గురవుతున్నారు. తండాలో 744మంది జనాభా ఉండగా 50 మంది వరకు జ్వరాలతో మంచం పట్టినట్లు తండా మాజీ ఉప సర్పంచ్ గణేష్ నాయక్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి తండాలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యం అందించాలని తండావాసులు కోరుతున్నారు.


జ్వర పీడితులు బానోత్ అంబి


బానోత్ విక్కి

దుస్తులు కుడుతూ.. భవనం కట్టి..!

- ఆర్థికంగా నిలదొక్కుకుని ఆదర్శంగా నిలిచిన ముత్యంపేట మహిళ ఆశ్రిత
- చేయూతనిచ్చిన స్వయంసహాయక సంఘం

దోమకొండ: బట్టలు కుడుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవడంతోపాటు ఇల్లు కట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఆశ్రిత. 2019లో మహిళా స్వయం సహాయక సంఘంలో రూ.100 సభ్యత్వంతో సంఘంలో చేరింది ఆశ్రిత. 2020లో పొదుపు సంఘం ద్వారా రూ.1లక్ష రుణం తీసుకుని టైలరింగ్ ప్రారంభించింది. అప్పట్లో వారు పెంకుటింట్లో ఉండేవారు. అనంతరం రుణం తీర్చి తిరిగి 2022లో మరో రూ.2లక్షల రుణం తీసుకుంది. టైలరింగ్‌తో పాటు బట్టలు దుకాణం ప్రారంభించింది. ఇటీవల సొంతంగా భవన నిర్మాణం చేసి, తన సొంత భవనంలోనే షాపు నడుపుతోంది. చాలా తక్కువ కాలంలో స్వయం సహాయక సంఘంలో రుణం తీసుకుని ఆర్థికంగా ఎదిగిన ఆశ్రిత తోటి మహిళలకు ఆదర్శంగా మారింది. ఆమె భర్త మెకానిక్‌షాపు నడుపుతున్నాడు. దీనికితోడు వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల డీఆర్‌డీఏ జిల్లా అధికారులు సైతం గ్రామంలోని బట్టల దుకాణం, టైలరింగ్ పనులను చూసి ఆశ్రితను అభినందించారు.


ముత్యంపేటలో టైలరింగ్, బట్టలషాపు నిర్వహిస్తున్న ఆశ్రిత

క్రీడలతో మానసిక ఉల్లాసం



భిక్కనూరు: క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు దేహధారుడ్యం పెంపొందించుకోవచ్చని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. తెయూ సౌత్‌క్యాంపస్‌లో శనివారం క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, హస్టల్‌వార్డెన్ యాలాద్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రతిజ్ఞ, రమాదేవి, దిలీప్, ఏపీఆర్‌వో సరితపాల్గొన్నారు.

రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఆయా గ్రామాలకు చెందిన రైతుల నుంచి రైతు భరోసా పథకం కోసం దరఖాస్తులు స్వీకరించినట్లు ఏవఅనిల్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని 980 మంది రైతులు కొత్తగా వ్యవసాయ భూములు పట్టా చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో నుంచి 360 మంది రైతులు పథకానికి దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన రైతులు తమ పరిధిలోని స్థానిక అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యాక్ బృందం సందర్శన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రం శివారులోని సరంపల్లి వద్ద ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలను శనివారం న్యాక్ బృంద సభ్యులు సందర్శించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణతో మాట్లాడి, పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాక్ బృందం సభ్యులు హేమంత్‌కుమార్, నందలాల్, మాధవి, రీజినల్ కో–ఆర్డినేటర్ గంగారాం నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



లింగంపేట(ఎల్లారెడ్డి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు మండలంలోని నల్లమడుగు జెడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వర్‌రావును మండల పీఆర్టీయూ ప్రతినిధులు శనివారం లింగంపేటలో సన్మానించారు. పీఆర్టీయూ ప్రతినిధులు రవీందర్‌శర్మ, రాజారెడ్డి, సుధాకర్ రావు, రజినీకాంత్‌గౌడ్, పారు తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోధన్ బస్టాండ్ వద్ద నుంచి బైక్ చోరీకి గురైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. షరీఫ్ అనే వ్యక్తి పని నిమిత్తం వచ్చి బస్టాండ్ వద్ద బైక్ నిలిపాడని, అతడు పని పూర్తి చేసుకొని తిరిగి వచ్చేసరికి దుండగుడు బైక్ ఎత్తుకెళ్లాడన్నారు. ఈనెల 8వ తేదీన బైక్ చోరీకాగా, బాధితుడు శనివారం ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వ్యభిచార గృహాలపై దాడి

- ఇద్దరు నిర్వాహకులపై కేసు నమోదు
- స్వధార్ హోంకు 8మంది మహిళల తరలింపు
- విటుల వివరాలు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని లక్కంపల్లి శివారు ప్రాంతంలో ఉన్న సురేశ్‌నగర్ కాలనీ సమీపంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. నందిపేట ఎస్సై చిరంజీవి, సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు బృందం సభ్యులు పలు గృహాలపై ఆకస్మికంగా దాడి చేశారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. బాధితులుగా ఉన్న ఎనిమిది మంది మహిళలను రెస్క్యూ చేసి నిజామాబాద్‌లోని స్వధార్ హోమ్‌కు తరలించారు. అయితే ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నప్పటికీ వారి వివరాలను గోప్యంగా ఉంచారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న వారిపై మాత్రమే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించడం చర్చకు దారితీసింది. విటులు లేకుండా వ్యభిచారం జరుగుతుందని పోలీసులు ఎలా నిర్ధారణకు వచ్చారని, ఒకవేళ విటులను అదుపులోకి తీసుకుంటే పోలీసులు ఆ విరాలను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

క్రైం కార్నర్

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు

- ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- తండ్రి మృతి..తల్లి, పిల్లలకు గాయాలు


రవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అంత్యక్రియలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా శనివారం ఉదయం మండల కేంద్రం శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇందల్‌వాయి మండలం నల్లవెల్లికి చెందిన లింగాపురం రవి(36) తన భార్య లావణ్య ఇద్దరు పిల్లలతో కలిసి ఎంద్రియాల్‌లో నిర్వహించిన బంధువు అంత్యక్రియలకు హాజరయ్యాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తుండగా కామారెడ్డి వైపు నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడడంతో రవి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఎగిరి రోడ్డు పక్కన పడగా గాయాలయ్యాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గోడకు కన్నం వేసి సూపర్ మార్కెట్లో చోరీ



కామారెడ్డి క్రైం: గోడకు రంధ్రం చేసి సూపర్ మార్కెట్‌లోకి చొరబడిన దుండగులు నగదుతోపాటు కిరాణా సామగ్రిని ఎత్తుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో అశోక్‌నగర్ వెళ్లే దారిలో ఉన్న విజయ సూపర్ మార్కెట్‌ను శుక్రవారం రాత్రి 11 గంటలకు నిర్వాహకులు మూసివేసి వెళ్లిపోయారు. ఉదయం వచ్చి చూడగా షాపులో గోడకు రంధ్రం ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. దుండగుడు సూపర్ మార్కెట్ వెనకాల ఉన్న చర్చి కంపౌండ్ గోడ పైనుంచి దూకి వచ్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. దుండగుడు కౌంటర్‌లోని రూ.30వేల నగదుతోపాటు కిరాణా సామగ్రి ఎత్తుకెళ్లినట్లు సూపర్ మార్కెట్ యజమాని ఫిర్యాదు చేశాడని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లేగ దూడపై చిరుత దాడి

వర్ని: మండలంలోని సిద్ధాపూర్ గ్రామ శివారులో పాత చెరువు కట్ట వద్ద లేగ దూడపై చిరుత దాడి చేసింది. గాయపడిన లేగ దూడకు చికిత్స అందిస్తున్నట్లు బాధితుడు బర్దావల్ హీరు తెలిపారు. చిరుత సంచారం నేపథ్యంలో ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని గ్రామస్తులు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

అత్యాచారం కేసులో రిమాండ్

బాన్సువాడ : కన్నకూతురిపై అత్యాచారం చేసిన తండ్రిని శనివారం బాన్సువాడ పోలీసులు రిమాండ్ చేసినట్లు తెలిసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై కన్న తండ్రే అత్యాచారం చేశాడు. బాలిక తండ్రిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

ఒకరిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు తెలిసింది. తన ఇంట్లోకి చొరబడ్డాడనే కారణంతో ఒకరిపై మరొకరు కత్తితో దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులను వివరణ కోరగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

గోవులను తరలిస్తున్న లారీ అడ్డగింత



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో గోవులను తరలిస్తున్న లారీని బజరంగ్‌దళ్ నాయకులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ నుంచి గోవులను లారీ తరలిస్తుండగా బాన్సువాడ ప్రాంతంలో వాహనం వేగంగా వెళ్లడంతో స్థానికులు గమనించి ఎల్లారెడ్డి బజరంగ్‌దళ్ నాయకులకు సమాచారం అందించారు. వెంటనే వారు లారీ వద్దకు వచ్చి అడ్డుకున్నారు. లారీలో గోవులు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. గోవుల లారీని బిచ్కుందలోని గోశాలకు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు.